


విదేశీ పర్యటనను దిగ్విజయంగా ముగించుకొని ఆ రోజే ఆఫీసులో అడుగుపెట్టాను. ఎన్నో సంవత్సరాల తర్వాత ఆఫీసును చూస్తున్న అనుభూతి కల్గింది. దాదాపు రెండు గంటలవరకు నాకు తీరిక దొరకలేదు. స్టాఫ్ మెంబర్స్ అందరూ నా ఛాంబర్‌లోకి వచ్చి పరామర్శించి వెళ్తున్నారు. నామీదవున్న గౌరవాభిమానాలతో పరామర్శించటానికి వచ్చినవాళ్లు కొందరైతే, నా విదేశీ అనుభవాలను తెల్సుకోవాలనే కుతూహలంతో వచ్చిన వాళ్లు మరికొందరు. పరామర్శించకపోతే సభ్యతగా ఉండదేమోనని భయభక్తులతో వచ్చినవాళ్లు ఇంకొందరు. అయితే ఇవేవీ లేకుండా కేవలం ఆఫీసు పనిమీదనే వచ్చిన వ్యక్తి ఒకే ఒక్కరు. అతని పేరు ఆనందరావ్. క్లెయిమ్స్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్.

విష్ చేస్తూ నా ఛాంబర్లోకి వచ్చాడు. 'ఎప్పుడొచ్చారు? మీ ట్రిప్ - బాగా జరిగిందా? ఇది చాలా అర్జంటుగా సెటిల్ చెయ్యాల్సిన క్లెయిమ్ సార్!'' అంటూ ఓ ఫైలును టేబుల్‌మీద పెట్టి నా సమాధానం కోసం ఆగకుండా ''ఎక్స్‌క్యూజ్‌మీ సార్!, బయట క్లయింట్స్ వెయిట్ చేస్తున్నారు.'' అని బాణంలా బయటకు దూసుకుపోయాడు.

ఆనందరావ్ తత్వం నాకు బాగా తెల్సు! మనిషి ఎంతో తక్కువగా మాట్లాడుతాడు. అయితే వర్క్ మాత్రం ఎంతో ఎక్కువగా

చేస్తాడు. సాధారణంగా అతనివద్ద పెండింగ్ ఫైల్స్ వుండవు. సిన్సియారిటీ అనే మాటకు అర్థం అతనిదగ్గరే నేర్చుకోవాలి. అలాంటి వ్యక్తి సర్వీసెస్ లభించటం చేతనే హెడ్డాఫీసులో మా డివిజన్‌కు ప్రత్యేక గౌరవం, గుర్తింపు లభించాయి. గత మూడేళ్ళుగా బెస్ట్ డివిజన్‌గా గుర్తింపు కల్గి షీల్డును కూడా సంపాదించుకొన్నాము. ఆనందరావ్ అంటే నాకో ప్రత్యేకమైన అభిమానం వుంది. అంతకుమించి కాన్ఫిడెన్స్ వుంది ఆతను పుటప్ చేసిన 'నోట్'ను చదవకుండానే సంతకాలు పెట్టిన సంఘటనలు విన్నో వున్నాయి.

బజ్జర్ నొక్కాను. హెడ్‌ప్యూన్ సిద్దయ్య లోపలికివచ్చి చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

"ఐస్ వాటర్ కావాలి!" అన్నాను.

"అలాగేసార్!" అంటూ టేబుల్‌మీదున్న గ్లాసును తీసుకొని బయటకు వెళ్ళాడు.

టేబుల్‌మీద పేపర్లన్నీ చిందరవందరగా పడి వున్నాయి. వీటిని పరిశీలించాలంటే కనీసం రెండు, మూడు రోజులు పట్టవచ్చు!

సిద్దయ్య అందించిన ఐస్ వాటర్ త్రాగి ఆనందరావ్ యిచ్చిన ఫైలును మెల్లగా తెరిచాను.

ఫైల్లో వున్న ఫోటోను చూడగానే కొయ్యబారిపోయాను.

కలా? నిజమా ?

వణుకుతున్న చేతులతో పేజీలు త్రిప్పాను. పేరు చూశాను.

అక్షరాలు మసక మసకగా కన్పించాయి.

చ... క్ర... పా... ణి...

* * *

ఆ రోజు దీపావళి...

ప్రొద్దున్నే స్నానం ముగించుకొని కార్లో చక్రపాణి యింటికి వెళ్ళాను.

వాళ్ళింటిముందు కారు పార్క్‌చేసి హారన్ మోగించేసరికి లోపల్నుంచి చక్రపాణి హడావుడిగా పరిగెత్తుకు వచ్చాడు నన్నుచూడగానే ఎంతో పొంగిపోయాడు. సాదరంగా లోపలికి తీసుకెళ్ళి వరండాలోవున్న కుర్చీచూపించాడు.

'ఈ పండక్కి నీవు వస్తావనుకోలేదు!' అన్నాడు చక్రపాణి నా ఎదురుగాకూర్చుంటూ.

'నాక్కూడారావాలనిలేదు!కాని అన్నపూర్ణ ఈ పండక్కి మనం విజయవాడ వెళ్ళాల్సినదేనండీ — అని పట్టుబట్టింది.



దట్నాల్ ! ఇలా వచ్చేశాను భార్యాపిల్లల సమేతంగా !'

'మంచిపని చేశావ్ ! నీవు నిజంగా అదృష్టవంతుడివోయ్ !'

'ఎందుకట ?' నవ్వుతూ అడిగాను.

'మీ మామగారికి ఏకైక అల్లుడివి ! అల్లుణ్ణి వెదకాల్సిన వయసు వచ్చినా ఎంచక్కా ప్రతి పండక్కి కొత్త అల్లునిలా అత్తారింటికి రావచ్చు !' అన్నాడు చక్రపాణి నవ్వుతూ.

'వెల్‌సెడ్ !' అంటూ గట్టిగా నవ్వేశాను.

'దండాలు దొరా !' అన్న కంఠం వినగానే గుమ్మంవైపు చూశాను.

ఎదురుగా కోయదొర !

**మాట్లాడే ఫ్రిజ్**

జపానులోని షిన్ ఎలక్ట్రిక్ కంపెనీ వారు మాట్లాడే ఫ్రిజ్‌ను తయారు చేశారు. దీనికి రెండుతలుపులుంటాయి. వీటిని సరిగ్గా మూసి వుంచకపోతే 30 సెకనులతర్వాత "తలుపుతీసిఉంది" అనిహెచ్చరిస్తుంది. తలుపులను 1950 సార్లు తెరవడం, మూయడం జరిగిన తరువాత లోపల వున్న పదార్థాలను తొలగించమని సలహా ఇస్తుంది. ఈ సందేశాల వలన విద్యుత్తు వృధా కాకుండా అరికట్టవచ్చు.

పర్మిషన్ తీసుకోకుండా వాడలా లోపలికి రావటం నాకు నచ్చలేదు. నాకు విపరీతమైన కోపం వచ్చింది. కాని చక్రపాణి లేచి వాడికి ఎదురువెళ్ళి 'సౌఖ్యమా ?' అని పరామర్శించటంతో అంతకుముందే వాడితో పరిచయం వుంది కాబోలు అనుకొని మౌనంగా కూర్చుండిపోయాను.

కోయదొర కొంచెం ముందుకు వచ్చి నేలమీద కూర్చున్నాడు.

చక్రపాణి అతని కెదురుగా కూర్చున్నాడు.

చక్రపాణి చేతిని వాడి చేతిలోకి తీసుకొని వివిధ కోణాలలో పరిశీలించసాగాడు. కాస్సేపు మౌనంగా వుండి ఎవరినో ధ్యానిస్తున్నట్లు కళ్ళు మూసుకొన్నాడు.

'మంచి రోజులొస్తున్నయ్ దొరా మాయమ్మ మహాలచ్చి మీ నట్టింట అడుగు పెడ్తది దొరా ! మోటారు ఫీల్డులో మా దొరా లక్షలు సంపాయిస్తవు ! ఇది ఈ కోయదొర మాట కాదు దొరా ! మా కొండదేవర వాక్కు దొరా ! నా వాక్కే నిజమైతే పట్టుబట్టలు పెట్టించండి ఈ కోయదొరకు ! జయము దొరా ! జయము !'

'నీ చేయి కూడా చూపిస్తావా ?' అని అడిగాడు చక్రపాణి.

"నాకు అర్జంటుపనివుంది అయినా వీటిమీద నాకు నమ్మకంలేదు !' అన్నాను.

'అదేమిదొరా ! ఈ కోయదొర జోస్యాన్నే అనుమానిస్తుంటిరా ! నా సంగతి ఎరుక లేదా దొరా నీకు !' నా వైపు చూస్తూ సీరియస్‌గా అడిగాడు.

'అదేంకాదు కాని నా కిప్పుడు టైమ్ లేదు !' అని వాడికి సమాధానంచెప్పి 'పాణీ ! ముందు అతన్ని పంపించిరా ! నా కోసం ఇంటిదగ్గర అన్నపూర్ణ ఎదురు చూస్తుంటుంది నేను త్వరగా వెళ్ళిపోవాలి !'అన్నాను.

చక్రపాణి ఇంట్లోకి వెళ్ళి డబ్బులు తీసుకువచ్చి కోయవాణ్ణి సాగనంపి వచ్చాడు.

నేను టీపాయ్ మీదున్న మాగజైన్‌లో పేజీలు త్రిప్పసాగాను.

చక్రపాణి నాకు కాఫీ కప్పు అందిస్తూ అన్నాడు 'చూడు బ్రదర్ ! ఈ లోకంలో ప్రతి మనిషికి ఏదో ఒక అపురూపమైన విద్యనిస్తాడు దేవుడు, కేవలం వేషభాషల ద్వారా మనిషి విలువను అంచనా వేయకుండా అతనిలోని గూఢమైన మహత్తర శక్తిని గుర్తించి గౌరవించటం మనం నేర్చుకోవాలి !'

'నీవు చెప్పేది ఆ కోయవాణ్ణి గురించే కదూ !'

'అవును'

'వాళ్ళ సంగతి నాకు బాగా తెల్సు ! సినిమాయాక్టర్లతోను, మంత్రులతోను తాము తీయించుకొన్న ఫోటోలను, చూపించి ఏవో నాల్గు తియ్యని కబుర్లుచెప్పి మోసం చేస్తుంటారు !'

'వాళ్ళకసలు జోస్యం తెలీదంటావా ?'

'జోస్యం సంగతెలావున్నా మనుషుల మనస్తత్వాలను, బలహీనతలను కనిపెట్టే తెలివితేటలు అపారంగా వుంటాయి. మాటల్లోకి దింపి మనసులోని భావాలను, భయాలను, అనుమానాలను, వ్యక్తిగత

పమస్యలను తెలివిగా వెలికిలాగి మనకు అనుకూలంగా మన మనస్సులు తృప్తిపడేలా జోస్యం చెబుతారు. ఎదుటివాడు అమాయకుడైతే చెప్పనక్కర్లేదు. రక్షరేకలనీ, అడవి చెట వేళ్లని ఏవేవో అంటగట్టి డబ్బు చేసుకొంటారు?'

'ఇంతకూ నీ కసలు జోస్యం అంటే నమ్మకం వుందా?'

'నమ్మకం వుందనిగాని, లేదనిగాని తేల్చి చెప్పలేను ఎవరి నమ్మకాలు వారివి! కొన్ని కొన్ని సంఘటనలు జరగటం వలన కొన్ని కొన్ని అభిప్రాయాలను మనం ఏర్పరచుకొంటాం! నన్నడిగితే భవిష్యత్తును గురించి తెల్సుకోకుండా వుండటమే మంచిది రేపు మంచి జరుగుతుందున్న ఆశే మనిషిని ముందుకు నడిపించాలి ప్రతి సూర్యోదయ శుభాన్ని సూచించి నవచైతన్యానికి నాంది కావాలి! అంతేకాని ఇలా జోస్యం చెప్పించుకొని భవిష్యత్తులో కల్గే బాధల గురించి భయపడుతూ జీవించటం మహా దారుణం!'

'బాధలే కల్గుతాయని ఎందుకనుకోవాలి! జోస్యం వలన కూడా భవిష్యత్తు పట్ల ఆశ కలుగుతుంది కదా!'

'ఆశకాదు! పేరాశ కల్గుతుంది. ఆ తదుపరి ఆశలు ఫలించలేదన్న నైరాశ్యం కల్గుతుంది. అందుకే నా సిద్ధాంతం ప్రకారం కష్టాన్నయినా సుఖాన్నయినా అనుభవించటానికి సిద్ధంగా మనం వుండాలి కాని ఈ జోస్యాన్ని నమ్ముకోటం మంచిదికాదు.'

'అది నీ సిద్ధాంతం! కాని బ్రదర్! ఈ కోయదొర లోగడ నాకు చెప్పిన విషయాలు చాలా నిజమయ్యాయి!'

'అయితే కంగ్రాట్స్! త్వరలోనే మోటార్ ఫీల్డ్‌లో లక్షలు సంపాయిస్తావన్నమాట!' అన్నాను పరిహాసంగా.

'మనిషి జీవితంలో ఎప్పుడు ఎలాంటి మార్పులు వస్తాయో మనం వూహించలేం! వాడు చెప్పింది నిజం కాదని ఎందుకనుకొంటున్నావ్?'

'మై డియర్ పాణీ! వాడి జోస్యానికి నీ జీవితానికి ఏమైనా సంబంధంవుందా? నువ్వు రైల్వేలో జాబ్ చేస్తున్నావ్! వెనుక ఆస్తిపాస్తులు లేవు. ఇక మోటారు ఫీల్డులో నీవు లక్షలు సంపాదిస్తావన్నాడు. యిూ జిట్ పాజిబుల్? నువ్వేమైనా టాక్సీల ఓనర్‌వా? లారీల యజమానివా? వాడి జోస్యం వెనుక ఓ లాజిక్ వుంది. మీ యింటిముందున్న కారు వాడి కంటబడింది. బహుశా అది మీ కారేనని భ్రమపడి ఓ కథ అల్లేశాడు!'

'నాకు కారు వున్నదీ లేనిదీ వాడికి బాగా తెల్సు! నా కసలు మోటారు ఫీల్డుతో సంబంధమే లేదని అంటున్నావ్ కదూ! ఫర్ యువర్ ఇన్‌ఫర్‌మేషన్ చెబుతాను విను! బ్యాంక్ లోన్ పెట్టాను. త్వరలోనే మోటార్‌సైకిల్‌ను కొనబోతున్నాను. ఆ తర్వాత ఓ టాక్సి ..'

'ఆ తర్వాత ఓ లారీ... అలా అలా లక్షలు సంపాదించబోతున్నావ్ కదూ!'

'నీకంతా హాస్యంగానే వుంది! చూడు బదర్! ఆ కోయదొర జోస్యం ఏనాటికైనా నిజమౌతుంది. నీ కళ్లెదుటే నేను కనీసం లక్షయినా సంపాదిస్తాను. ఈ గీతలెప్పుడూ అబద్ధం చెప్పవు సుమా!' అంటూ తన అరచేతిని నా కళ్లకు దగ్గరగా వుంచాడు పాణి.

* * *

"సార్! మీ కళ్లలో ఆ నీళ్ళేమిటి?" అన్న ప్రశ్న వినగానే గతం నుండి తేరుకొన్నాను.

ఎదురుగా ఆనందరావ్ నిలబడి వున్నాడు.

"మిస్టర్ ఆనంద్! ఈ లారీఏక్సిడెంట్‌లో మరణించిన వ్యక్తి ఎవరో తెలుసా?"

"చక్రపాణిని రైల్వే వుద్యోగి!"

"నీకు అంతవరకే తెలుసునయ్యా! కాని అతను నా ప్రాణ స్నేహితుడు! ఒకే వూళ్లో పుట్టాం! ఒకే స్కూల్లో చదివాం! ఆర్థిక ఇబ్బందులవలన అతని చదువు స్కూల్ ఫైనల్‌తోనే ఆగిపోయింది. రైల్వే సర్వీస్ కమీషన్ పాసయి విజయవాడలో వుద్యోగం చేస్తున్నాడు. ఇంత హఠాత్తుగా..." నా కంఠం పెగల్లేదు.

"అయామ్ సో సారీ! కలకత్తా కోర్టులో లోగడ వచ్చిన జడ్జిమెంట్ ఆధారంగా అరవై వేలకు కాంప్రమైజ్ చేయటానికి నోట్ పెట్టాను సార్! ఏమైనా మార్పా లంటారా?"

"వాట్ నెసెస్సరీ! ఇతనికి పర్సనల్ ఆక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీకూడా వుంది" అంటూ కర్చీఫ్‌తో కన్నీళ్లు తుడుచుకొన్నాను.

"ఆ ఫైలు తీసుకువచ్చాను సార్! నలభై వేలకు నోట్ పెట్టాను."

థర్డ్‌పార్టీ క్లెయిమ్... అరవై వేలు, పర్సనల్ యాక్సిడెంట్ క్లెయిమ్... నలభై వేలు... మొత్తం లక్ష రూపాయలు... ఫైల్లోవున్న చకపాణి ఫొటోను చూడగానే దుఃఖంతో నా హృదయం తల్లడిల్లిపోయింది.

కళ్ళు మూతలు పడినా పాణి ముఖంలో అంతులేని తేజస్సు సాక్షాత్కరించింది నాకా క్షణంలో.

అందుక్కారణం—

భార్యా పిల్లలకు ఓ బంగారుభవిష్యత్తును కల్పించానన్న సంతృప్తి కావొచ్చు!

లేదా,

ఆ కోయదొర జోస్యం ఫలించినందుకు కల్గిన గర్వం కావొచ్చు!

